క్లుప్తంగా

కుంభమేళాలో వైద్యుడు భానుమూర్తి సేవలు



మచిలీపట్నంటౌన్: కుంభమేళా భక్తులకు స్థానిక జీజీహెచ్ నేత్ర వైద్య విభాగ అధిపతి జి.భానుమూర్తి వైద్య సేవలు అందించారు. ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం, కుంభమేళా ఆర్గనైజర్స్ ఆహ్వానం మేరకు వైద్యుడు భానుమూర్తి, ఇతర కంటి వైద్య నిపుణులు మెగా ఉచిత కంటి వైద్య శిబిరానికి హాజరై ఈనెల 6వ తేదీ నుంచి కుంభమేళాకు వచ్చిన రోగులకు నేత్ర చికిత్స అందించి కళ్లజోళ్లను అందజేశారు. దేశంలో చాలామంది కంటి వైద్యులు పాల్గొని నేత్ర వైద్య చికిత్సను అందించగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నుంచి భానుమూర్తి ప్రాతినిధ్యం వహించి నేత్ర చికిత్సలు అందించినందుకు గాను ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం, కుంభమేళా ప్రతినిధులు ఆయనను సన్మానించి, ప్రశంసా పత్రాన్ని అందజేశారు.

జ్యోతిర్మహోత్సవాలు ప్రారంభం

పెడన: శ్రీరామలింగ చౌడేశ్వరి దేవి జ్యోతిర్మహోత్సవాలను పురస్కరించుకుని మంగళవారం వేకువ జామున ప్రత్యేక పూజలు నిర్వహించి ఆనపూజ చేశారు. ఈ పూజా క్రతువుతో జ్యోతిర్మహోత్సవాలు ప్రారంభమైనట్లు ఉత్సవ కమిటీ వారు తెలిపారు. అమ్మవారి భజన గుడి వద్ద ఆనపూజకు పెద్ద ఎత్తున భక్తులు పాల్గొన్నారు. ఊటుకూరి ఏకనాథ్ సుధీర్‌కుమార్, హేమకనకదుర్గ నాగరాణి దంపతులచే పండితులు పూజలు చేయించి ఆనపూజ చేశారు. మంగళవారం అర్ధరాత్రి కొమారకం ఉంటుందని, బుధవారం రాత్రికి నిర్వహించే అలుగుసేవకు ఆహ్వానం పలుకుతూ కొమారకం కార్యక్రమం పురవీధులలో ఊరేగింపు ద్వారా పిలుపు కార్యక్రమం చేపట్టనున్నారు.

అన్నసమారాధన

పెడన: పట్టణంలోని పాతపేటలో శ్రీముత్యాలమ్మ తల్లి ఘటం పైడమ్మ అమ్మ వారి దేవస్థానం, మెయిన్ రోడ్‌లో పాతకూరగాయల మార్కెట్ సమీపంలో శ్రీ పోతురాజు స్వామి దేవస్థానం వద్ద మంగళవారం భారీ అన్నసమారాధన నిర్వహించారు. మాఘ శుద్ధ పౌర్ణమి సందర్భంగా ఉదయం అమ్మవారికి, స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. మధ్యాహ్నం ఆయా చోట్ల గొప్ప అన్న సమారాధన నిర్వహించగా భక్తులు పెద్ద ఎత్తున అన్న ప్రసాదాలను స్వీకరించారు. ఆలయ ధర్మకర్తలు, సేవాదళ్ సభ్యులు, పాతపేట దేవాంగ పెద్దలు, మహిళలు తమ వంతు సహాయ సహకారాలు అందించి ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

నిత్యావసర సరుకుల పంపిణీ



కోనేరుసెంటర్: మండల పరిధిలోని కొత్తపూడి గ్రామంలో ఇటీవల జరిగిన అగ్నిప్రమాదంలో సర్వంకోల్పోయిన బాధిత కుటుంబానికి చలమలశెట్టి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో మంగళవారం నిత్యావసర సరుకులు, వంటసామగ్రి, దుస్తులను అందజేశారు. ట్రస్ట్ మేనేజర్ చలమలశెట్టి పాండురంగారావు మాట్లాడుతూ చలమలశెట్టి చారిటబుల్ ట్రస్ట్ తరపున అగ్నిబాధిత కుటుంబాలను ఆదుకునేందుకు తామెప్పుడూ సిద్ధంగా ఉంటామన్నారు. ట్రస్ట్ సభ్యులు పవన్‌కుమార్, జనసేన నాయకుడు మెరుగు రమేష్ తదితరులు పాల్గొన్నారు.

జిల్లా వాలీబాల్ పోటీల్లో బాలికల ప్రతిభ

చల్లపల్లి: 68వ గ్రిగ్ మెమోరియల్ బాలికల జూనియర్ వాలీబాల్ పోటీలలో చల్లపల్లికి చెందిన విజయ అకాడమీ బాలికల జట్టు జిల్లా స్థాయి విజేతగా నిలిచి ట్రోఫీని కైవసం చేసుకుంది. అవనిగడ్డలో నిర్వహించిన ఈ పోటీల్లో వాలీబాల్ జూనియర్ బాలికల విభాగంలో ఫైనల్స్‌లో విజయ అకాడమి జూనియర్ బాలికల జట్టు మొవ్వ మండలం పెదముత్తేవి ఓరియంటల్ స్కూల్ జట్టు తలపడగా విజయ అకాడమి జట్టు విజేతగా నిలిచింది. వారికి శిక్షణ ఇచ్చిన పీఈటీ పి.అర్జునరావు, బాలికల జట్టు క్రీడాకారిణులను అకాడమి చైర్మన్ గొర్రెపాటి రంగనాథబాబు, కరస్పాండెంట్ గొర్రెపాటి రామకృష్ణ, ప్రిన్సిపాల్ నాగళ్ల భీమారావు అభినందించారు.

చిత్ర యూనిట్ సందడి



పెడన: మండల పరిధిలోని నందమూరు శ్రీవాసవి ఇంజినీరింగ్ కళాశాలలో మంగళవారం సినీనటుడు విశ్వక్సేన్ సందడి చేశారు. లైలా సినిమా ఈనెల 14న విడుదల కానున్న సందర్భంగా చిత్రం యూనిట్ కళాశాలకు విచ్చేసింది. ఈ సందర్భంగా కళాశాలలో ఏర్పాటు చేసిన సభలో లైలా సినిమా గురించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో అనుదీప్, విజయ్, కళాశాల మేనేజ్‌మెంట్, సిబ్బంది విద్యార్థులు పాల్గొన్నారు.

మాఘపౌర్ణమి స్నానాలకు ముస్తాబు

- నేడు సాగరతీరంలో మాఘపౌర్ణమి స్నానాలు
- ఏర్పాట్లు చేసిన అధికార యంత్రాంగం

కోడూరు: కృష్ణానది వేలాది కిలోమీటర్లు ప్రయాణించి సాగరుడిలో కలిసే పవిత్ర హంసలదీవి క్షేత్రం మాఘపౌర్ణమి స్నానాలకు (సింధుస్నానాలు) ముస్తాబైంది. భక్తులు పుణ్యస్నానాలు ఆచరించేందుకు అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. బుధవారం ఉదయం 5గంటల నుంచే భక్తులు సింధుస్నానాలు చేసేందుకు అవకాశం కల్పించారు.

ఏర్పాట్లు ఇవీ..

సాగరసంగమం, సముద్రం వద్ద బారికేడింగ్ వ్యవస్థను ఏర్పాటు చేసి, పర్యాటకుల భద్రత కోసం పది మరబోట్లు, 60 మంది గజఈతగాళ్లను సిద్ధంగా ఉంచారు. కోడూరు, మందపాకల పీహెచ్‌సీల ఆధ్వర్యంలో నాలుగు వైద్యశిబిరాలు, 108 వాహనాన్ని సిద్ధంగా ఉంచారు. మహిళలు దుస్తులు మార్చుకునేందుకు తీరం ఒడ్డున ఆరు తాత్కాలిక మరుగుదొడ్లను నిర్మించారు. పాలకాయతిప్ప నుంచి సాగరతీరం వరకు రహదారికి మరమ్మతులు చేసి, జంగిల్ క్లియరెన్స్ పనులు నిర్వహించారు.

బందోబస్తు..

అవనిగడ్డ డీఎస్పీ విద్యశ్రీ పర్యవేక్షణలో ఇద్దరు సీఐలు, ఆరుగురు ఎస్‌ఐలు, 150 మంది పోలీసులతో బందోబస్తు చేపడుతున్నారు. సింధుస్నానాలకు వచ్చే యాత్రికుల కోసం అవనిగడ్డ ఆర్టీసీ డిపో నుంచి హంసలదీవి స్పెషల్ పేరుతో ప్రత్యేక బస్సు సర్వీసులను నడుతుపున్నారు.

లక్ష మందికి పైగా..

సాగర తీరంలో సింధుస్నానాలకు లక్ష మందికిపైగా యాత్రికులు వచ్చే అవకాశం ఉన్నట్లు అధికారులు అంచనా వేశారు. సీఐలు యువకుమార్, సురేష్ రెడ్డి, ఎంపీడీఓ సుధాప్రవీణ్, తహసీల్దార్ శ్రీనునాయక్, ఈఓపీఆర్డీ నాగరేవతి, ఎస్‌ఐ చాణిక్య, ఈఓ లీలాప్రియాంక మంగళవారం సాగరతీరంలో పర్యటించారు. అక్కడ ఏర్పాట్లను పర్యవేక్షించారు. పలు సూచనలు చేశారు.

సింధుస్నానం ప్రత్యేకత..

సింధు అంటే సముద్రం అని అర్థం. మాఘశుద్ధ పౌర్ణమి రోజున సముద్రంలో నది కలిసే ప్రాంతంలో స్నానమాచరించడాన్నే సింధుస్నానం అంటారు. సూర్యుడు మకరరాశిలో ఉండగా పౌర్ణమి రోజున ప్రసరించే కిరణాలు సముద్రపునీటిపై పడి శక్తివంతమవుతాయిని, ఈ ప్రభావంతో సముద్రంలో ఉండే రత్నాలు, దివ్య ఔషధాలు సంకలనం చెందుతాయని, ఆ సమయంలో సముద్రస్నానం చేయడం వల్ల సర్వరోగాలు తొలుగుతాయని పండితులు చెబుతున్నారు.





హంసలదీవిలో ఏర్పాట్లు పరిశీలిస్తున్న పంచాయతీ అధికారులు ; హంసలదీవి సాగరతీరం

కృష్ణా మిల్క్ యూనియన్ వజ్రోత్సవాలు

రావివారిపాలెం(మోపిదేవి): కృష్ణామిల్క్ యూనియన్ 60 సంవత్సరాల (డైమండ్) జూబ్లీ అభివృద్ధిలో ప్రతి పాల ఉత్పత్తిదారులు భాగస్వాములేనని పాలకేంద్రం మాజీ అధ్యక్షులు రావి వెంకటేశ్వరావు అన్నారు. మండలంలోని రావివారిపాలెంలో పాల కేంద్రం అధ్యక్షుడు రావి లక్ష్మణరావు అధ్యక్షతన మంగళవారం కృష్ణామిల్క్ యూనియన్ స్థాపించి 60 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా కేక్ కట్ చేసి డైమండ్ జూబ్లీ ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వెంకటేశ్వరావు మాట్లాడుతూ పాడి రైతులు సంస్థ అభివృద్ధిలో పాలు పంచుకుంటున్నారని అభినందించారు. పాలకేంద్రం అధ్యక్షుడు లక్ష్మణరావు మాట్లాడుతూ కుటుంబాల జీవనానికి ప్రత్యక్ష, పరోక్ష ఉపాధి కల్పిస్తుందని సంస్థను ఆయన కొనియాడారు. అనంతరం సంఘ అభివృద్ధికి సహకరించిన మాజీ అధ్యక్షులు, సీనియర్ సంఘ సభ్యులు, నీటి సంఘాల అధ్యక్షులకు బహుతులు ఇచ్చి ఘనంగా సన్మానించారు. యూనియన్ సూపర్‌వైజర్ మోర్ల వరప్రసాద్, పాల ఉత్పత్తిదారులు, సంఘ సభ్యులు పాల్గొన్నారు.

నాగాయలంక: స్థానిక పాల ఉత్పత్తిదారుల సహకార సంఘం ఆధ్వర్యంలో మంగళవారం ముగ్గురు సీనియర్ పాల ఉత్పత్తిదారులను ఘనంగా సన్మానం నిర్వహించారు. కృష్ణా మిల్క్ యూనియన్ వజ్రోత్సవాలను పురస్కరించుకుని సంఘం అధ్యక్షుడు తలశిల బాబూరావు నేతృత్వంలో గత 30 ఏళ్లగా నిరంతరాయంగా సంఘానికి పాలు పోస్తున్న రైతులు భీమా సుబ్బారావు, కావూరి పాపారావు, కొల్లి శివరామకృష్ణలను సన్మానం చేశారు. బీమా నారాయణ, వక్కపట్ల శ్రీనావాస్, సబ్బినేని సోమశేఖర్, రైతులు పాల్గొన్నారు.

ఘంటసాల: కృష్ణా మిల్క్ యూనియన్ ప్రారంభించి 60 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా ఘంటసాల పాల ఉత్పత్తిదారుల సంఘం సర్వసభ్య సమావేశం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన పాల రైతుల పండుగ కార్యక్రమంలో మూడు తరాలుగా నిరంతరం పాలు పోస్తున్న రైతులను ఘనంగా సన్మానించారు. పాలకేంద్రాన్ని విజయవంతంగా నడిపిస్తున్న అధ్యక్షుడు గొర్రెపాటి సురేష్‌ను రైతులు సన్మానించారు. పాలకవర్గ సభ్యులు, రైతులు పాల్గొన్నారు.

పెడన: మండల పరిధిలోని కూడూరు పంచాయతీ కృష్ణాపురం గ్రామంలో కృష్ణామిల్క్ యూనియన్ వజ్రోత్సవాలను పురస్కరించుకుని పాల ఉత్పత్తిదారులకు కుక్కర్లను పంపిణీ చేశారు. మంగళవారం కార్యక్రమంలో యూనియన్ డైరెక్టర్ అర్జా వెంకట నగేష్ 51 మందికి కుక్కర్లను అందజేశారు. పాడి రైతులు పండుగ వాతావరణంలో స్వీట్స్ పంపిణీ చేసుకున్నారు. సంఘ అధ్యక్షుడు వేముల శోభనాద్రి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఫీడ్ కమిటీ సభ్యులు మోతుకూరి వెంకటేశ్వరరావు, గుడ్లవల్లేరు పాల శీతలీకరణ కేంద్రం మేనేజర్ తోట సత్యనారాయణ, సూపర్‌వైజర్ పెయ్యేటి బసవరాజ కుమార్, వేతన కార్యదర్శి వేణు, పాల ఉత్పత్తి దారులు పాల్గొన్నారు.

చల్లపల్లి: కృష్ణా మిల్క్ యూనియన్ విజయా డెయిరీ ప్రారంభించి 60 వసంతాలు పూర్తి చేసుకున్న సందర్భంగా చల్లపల్లి పాల ఉత్పత్తిదారుల సహకార సంఘం ఆధ్వర్యంలో యూనిట్ సూపర్ వైజర్ తమ్మన సురేష్ కుమార్ పర్యవేక్షణలో వజ్రోత్సవం మంగళవారం ఘనంగా నిర్వహించారు. కేక్ కట్ చేసి పంపిణీ చేశారు. అనంతరం పలువురికి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో సంఘం పాలక సిబ్బంది, పాడి రైతులు పాల్గొన్నారు.



రావివారిపాలెంలో సంఘ మాజీ అధ్యక్షులను సన్మానిస్తున్న సంఘం అధ్యక్షుడు లక్ష్మణరావు

మున్సిపల్ స్థలం వద్ద హెచ్చరిక బోర్డు

బోర్డును పడేసిన గుర్తు తెలియని వ్యక్తులు

పెడన: పట్టణంలోని రామలక్ష్మీ వీవర్స్ కాలనీలో రూ.కోట్లు విలువ చేసే మున్సిపల్ స్థలం ఆక్రమించుకునేందుకు కొందరు ప్రయత్నిస్తుండటంతో మున్సిపల్ అధికారులు సోమవారం రాత్రి హెచ్చరిక బోర్డును ఏర్పాటు చేశారు. 'మున్సిపల్ స్థలం కబ్జాకు యత్నం' శీర్షికన మంగళవారం'సాక్షి'లో కథనం ప్రచురితమైన విషయం పాఠలకు విధితమే. టీడీపీ నాయకుడు, మాజీ కౌన్సిలర్ పరసా సూర్యనారాయణ మున్సిపల్ స్థలాన్ని ఆక్రమించుకునేందుకు పనివారితో పరిశుభ్రం చేయించడమే కాకుండా మట్టిని తోలారంటూ స్థానికులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసిన విషయం తెల్సిందే. మున్సిపల్ అధికారులు స్థలాన్ని పరిశీలించి ఆక్రమించుకునేందుకు యత్నించిన వారికి హెచ్చరికలు జారీ చేశారు. ఆధారాలంటే చూపాలంటే స్పష్టం చేశారు. టీపీవో సుజనకుమారి ఆదేశాల మేరకు వార్డు సచివాలయ ప్లానింగ్ కార్యదర్శి శివ మున్సిపల్ స్థలం వద్ద హెచ్చరికబోర్డును సోమవారం రాత్రి ఏర్పాటు చేశారు. అయితే మంగళవారం ఉదయం ఆ బోర్డు దూరంగా పడేసి ఉంది. మున్సిపల్ స్థలం చుట్టూ ఫెన్సింగ్ వేయించి పటిష్ట చర్యలు చేపట్టాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. ఆక్రమించుకునేందుకు యత్నించిన వారిపై కేసు పెడితే మరికొందరు భయపడతారని స్థానికులు స్పష్టం చేస్తున్నారు.



మున్సిపల్ స్థలం వద్ద ఏర్పాటు చేసిన హెచ్చరిక బోర్డు, పక్కన ప్లానింగ్ కార్యదర్శి శివ (ఇన్‌సెట్లో) కింద పడిపోయిన బోర్డు

మెరుగైన వైద్య సేవలందిస్తే ప్రజాదరణ



నాగాయలంక: మెరుగైన వైద్యసేవలు అందించిన ప్రభుత్వ వైద్యాధికారులు క్షేత్రస్థాయిలో ప్రజల ఆదరణ పొందుతారని కృష్ణా డీహెచ్‌ఎంఓ డాక్టర్ ఎస్.షర్మిష్ఠ పేర్కొన్నారు. నాగాయలంక ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో వైద్యాధికారిగా విధులు నిర్వహిస్తున్న డాక్టర్ వి.శివరామకృష్ణ పీజీ కోర్సు చదివేందుకు వెళ్తున్న క్రమంలో మంగళవారం స్థానిక ఆసుపత్రిలో వైద్య, ఆరోగ్య సిబ్బంది ఏర్పాటు చేసిన వీడ్కోలు సభలో డీహెచ్‌ఎంఓ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. శివరామకృష్ణను ఘనంగా సన్మానించారు. గ్రామ సర్పంచి కైతేపల్లి అంకాలు, డాక్టర్ ఎం.ఇంద్రకుమార్‌రెడ్డి, డాక్టర్ కె.శ్యామ్‌ప్రసాద్, డాక్టర్ రాజేశ్వరరావు, డాక్టర్ ఫాతీముసీన్నీసా, సిబ్బంది పాల్గొన్నారు.

ఘంటసాల పాటలు అజరామరం

ఘంటసాల: గాయకుడు ఘంటసాల వెంకటేశ్వరరావు పాటలు అజరామరం అని పలువురు వక్తలు అన్నారు. ఘంటసాల గ్రామంలోని ఘంటసాల కళాతోరణంలో మధుర గాయకుడు ఘంటసాల వెంకటేశ్వరరావు 51వ వర్ధంతిని మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఘంటసాల విగ్రహానికి పీహెచ్‌సీ డాక్టర్ వేమూరి ప్రమోద్ కుమార్, ఘంటసాల కళాసమితి కార్యదర్శి పోతన వెంకటేశ్వరరావు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా జెడ్పీ మాజీ వైస్ చైర్మన్ గొర్రెపాటి రామకృష్ణ మాట్లాడుతూ ఘంటసాల వెంకటేశ్వరరావు పూర్వీకుల జన్మస్థలం ఘంటసాల అని, ఆయన 1767 ఏప్రిల్ 21న సంత మార్కెట్ సమీపంలో మూడు గంటల పాటు పాటల కచేరి నిర్వహించారని, దీనికి గుర్తుగా 2027 నాటికి కచేరి చేసి 60 ఏళ్లు పూర్తి అవుతున్న సందర్భంగా రూ.60 లక్షలతో ఘంటసాల వెంకటేశ్వరరావు కచేరి హాల్ నిర్మాణం కొరకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో రేడియో ఆర్టిస్టు బలే వెంకటేశ్వరరావు, ఫార్మసిస్టు కృష్ణ, వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

టేకుపల్లి(మోపిదేవి): అమరగాయకుడు ఘంటసాల వెంకటేశ్వరావు వర్ధంతిని మంగళవారం నిర్వహించారు. ఎన్నోమధుర గీతాలు అందించిన ఘంటసాల స్వగ్రామం టేకుపల్లిలో ఆయన విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కోసూరువారి పాలెం మాజీ ఉప సర్పంచ్ కోసూరు రామాంజనేయులు, ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుడు కుప్పా రాజశేఖర్, విద్యార్థులు పాల్గొన్నారు.

కృష్ణమ్మ విగ్రహం వెలికితీతను అడ్డుకున్న అధికారులు

కోడూరు: హంసలదీవి సాగరసంగమం వద్ద మాయమైన కృష్ణమ్మ విగ్రహాన్ని వెలికతీసేందుకు ప్రయత్నించిన పోలీసులను పాలకాయతిప్ప అటవీ అధికారులు అడ్డుకున్నారు. 2016 పుష్కరాల సమయంలో సాగరసంగమం వద్ద కృష్ణవేణమ్మ విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. కాలక్రమంలో భక్తుల రాకపోకలను నిషేధించడంతో కృష్ణమ్మ విగ్రహం ప్రతిష్ఠించిన ప్రాంతంలో కనిపించకుండా పోయింది. విగ్రహం విషయమై మంగళవారం పత్రికల్లో కథనాలు రావడంతో అవనిగడ్డ సీఐ యువకుమార్, పాలకాయతిప్ప మెరైన్ సీఐ సురేష్‌రెడ్డి ప్రత్యేక దృష్టి సారించి, విగ్రహం వెలికతీసేందుకు ప్రయత్నాలు చేశారు. సంగమం వద్ద విగ్రహం కుప్పకూలి ఇసుకలో కురుకుపోయిందనే అనుమానంతో వీరు ఘటనా స్థలానికి జేసీబీని పంపారు. అయితే అటవీ అధికారులు కరకట్ట వద్దే జేసీబీని అడ్డుకున్నారు. విగ్రహం మాయమైతే తమ ఉన్నతాధికారులు చూసుకుంటారని, సంగమం వరకు వెళ్లడానికి వీలు లేదని జేసీబీని తిప్పి పంపారు.

ఘనంగా నాగమ్మతల్లి వార్షికోత్సవం

కృత్తివెన్ను: మండలంలోని యండపల్లి గ్రామంలో కొలువై ఉన్న శ్రీ నాగమ్మతల్లి వార్షిక మహోత్సవం మంగళవారం ఘనంగా జరిగింది. ఉదయం నుంచి ఆలయం వద్ద ప్రత్యేక పూజాకార్యక్రమాలు జరిపారు. భక్తులు పుట్టలో పాలుపోసి నాగమ్మతల్లికి మొక్కుబడులు తీర్చుకున్నారు. ఆలయం వద్ద ఏర్పాటు చేసిన భజనా కార్యక్రమం భక్తులను విశేషంగా అలరించింది. అనంతరం ఆలయం వద్ద ఏర్పాటు చేసిన అన్నసమారాధనలో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని అమ్మవారి ప్రసాదాన్ని స్వీకరించారు.

సామూహిక కుంకుమార్చన

కోడూరు: హంసలదీవిలోని రుక్మిణీ సత్యభామ సమేత వేణుగోపాల స్వామివారి ఆలయంలో బ్రహ్మోత్సవాలు వైభవంగా సాగుతున్నాయి. రెండవ రోజైన వేణుగోపాలుడి మూలమూర్తికి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ధర్మాధికారి కుప్పా సుబ్రహ్మణ్య అవధాని శిష్య బృందంతో కలిసి పూజల్లో పాల్గొన్నారు. ఉదయం రాజ్యలక్ష్మీ అమ్మవారికి సామూహిక కుంకుమార్చనను భక్తిప్రపత్తులతో నిర్వహించారు. కుప్పా వంశానికి చెందిన మహిళలు పసుపు, కుంకుమ, పట్టువస్త్రాలను ఊరేగింపుగా తీసుకువచ్చి అమ్మవారికి సమర్పించారు. అన్నపూర్ణ సత్రంలో భక్తులకు అన్నసమారాధన నిర్వహించారు. రాత్రికి స్వామివారి కల్యాణోత్సవాన్ని నిర్వహించారు.

ప్రభుత్వ వైద్యశాలలను వినియోగించుకోవాలి

ఘంటసాలపాలెం(ఘంటసాల): గర్భవతులు ప్రభుత్వ ఆసుపత్రుల్లో అందిస్తున్న సేవలు సద్వినియోగం చేసుకుని సుఖ ప్రసవాలు అవ్వాలని ఘంటసాలపాలెం పీహెచ్‌సీ డాక్టర్ యు.నిఖిత ప్రసాద్ అన్నారు. మండలంలోని ఘంటసాలపాలెం పీహెచ్‌సీలో ప్రధాన మంత్రి సురక్షత్ మాతృత్వ అభియాన్ కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ నిఖిత ప్రసాద్ గర్భవతులకు వైద్య పరీక్షలు నిర్వహించి సూచనలు, సలహాలు అందించి మందులు ఇచ్చారు. కార్పొరేట్ ఆసుపత్రుల్లో వేల రూపాయలు ఖర్చు చేసి డెలివరీ అయ్యేకంటే ఘంటసాలపాలెం పీహెచ్‌సీల్లో ఉచితంగా నార్మల్ డెలివరీలు చేస్తున్నామని అవగాహన కల్పించి, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ప్రసాద్ కోరారు. సిబ్బంది పాల్గొన్నారు.

నేటి నుంచి సామాజిక తనిఖీలు

నాగాయలంక: మండలంలో 2023-24ఆర్థిక సవత్సరంలో జరిగిన ఉపాధి హామీ పథకం పనులకు సంబంధించి సామాజిక తనిఖీలు బుధవారం నుంచి ఈనెల 24వ తేదీ వరకు జరుగుతాయని స్థానిక ఎంపీడీఓ జే సీతారామ్‌కుమార్, ఎన్‌ఆర్‌ఈజీఎస్ ఏపీఓ టీవీఎం ముత్యాలు మంగళవారం చెప్పారు. మండలంలో ఉపాధి హామీ కూలీల వేతనాల కింద జరిగిన రూ.11.04 కోట్లు, మెటీరియల్ వ్యయం రూ.1.90 కోట్లు సంబంధిత పనులపై సామాజిక తనిఖీలు జరుగుతాయని చెప్పారు. ఐదు ప్రత్యేక బృందాలు సేకరించిన అంశాలను గ్రామ సభలో చర్చిస్తారని పేర్కొన్నారు.

అభివృద్ధి పనులను త్వరగా పూర్తి చేయండి

కలెక్టర్ డీకే బాలాజీ

చిలకలపూడి(మచిలీపట్నం): జిల్లాలో వివిధ నిధులతో చేపడుతున్న అభివృద్ధి పనులు, అంగన్‌వాడీ కేంద్రాల్లో టాయిలెట్లు, తాగునీటికి సంబంధించిన పనులు వెంటనే పూర్తి చేయాలని కలెక్టర్ డీకే బాలాజీ అన్నారు. ఎంపీ నిధులు, సీఎస్ఆర్ నిధులతో జరుగుతున్న అభివృద్ధి పనులపై కలెక్టర్ సమావేశపు హాలులో అధికారులతో మంగళవారం సమీక్ష నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ నెలాఖరు నాటికి పెండింగ్ లేకుండా పనులన్నీ పూర్తి చేయాలన్నారు. ఇప్పటికే 90 శాతానికి పైగా పనులు పూర్తి చేశామని, మిగిలిన పనులు వెంటనే పూర్తి చేస్తామని గ్రామీణ నీటి సరఫరా అధికారులు కలెక్టర్‌కు వివరించారు. పూర్తయిన పనుల బిల్లులను ఎప్పటికప్పుడు అప్‌లోడ్ చేసి చెల్లింపులు చేయాలని కలెక్టర్ సూచించారు. సమావేశంలో గ్రామీణ నీటి సరఫరా జిల్లా అధికారి నటరాజ్, మహిళాభివృద్ధి, శిశుసంక్షేమశాఖ పీడీ ఎంఎస్ రాణి, ఇంజినీరింగ్ అధికారులు పాల్గొన్నారు.



అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ డీకే బాలాజీ

చట్టాలపై అవగాహన ఉండాలి

చిలకలపూడి(మచిలీపట్నం): బడుగు, బలహీన వర్గాలు, మహిళలు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని సీనియర్ సివిల్ జడ్జి, న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి కేవీ రామకృష్ణయ్య అన్నారు. బలరామునిపేటలో మంగళవారం సాయంత్రం న్యాయవిజ్ఞాన సదస్సును నిర్వహించారు. ఈ సదస్సులో న్యాయమూర్తి మాట్లాడుతూ తమ సంస్థ ఇరువర్గాల వారిని ఏ రకంగా ఒక తాటిపైకి తీసుకువస్తుందో సమస్యను ఏ విధంగా పరిష్కరిస్తారో విపులంగా వివరించారు. దివ్యాంగుల కోసం న్యాయవ్యవస్థ ఆధ్వర్యంలో రెండు రోజుల నుంచి న్యాయవాదులు, పారా లీగల్ వలంటీర్లు ఇంటింటి సర్వే చేసి వారిని గుర్తిస్తున్నారన్నారు. వివాహిత మహిళలు అత్తారింటిని పుట్టిల్లుగా భావిస్తే ఎక్కువ ఒత్తిడి ఉండదని, అప్పుడు మంచి ఆరోగ్యంతో అందరూ కలిసి మెలిసి ఉండవచ్చన్నారు. ఈ సదస్సులో ఏఎస్‌ఐ విమల, వన్‌స్టాప్ సెంటర్ డిస్ట్రిక్ కోఆర్డినేటర్ అస్మిత, లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ చీలి మునలయ్య, న్యాయవాది అజ్మతున్నీసా తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న న్యాయమూర్తి కేవీ రామకృష్ణయ్య

మోతాదుకు మించి మందులు వాడితే నష్టం

కేవీకే సమన్వయకర్త డాక్టర్ డి.సుధారాణి

కొత్తపల్లి(ఘంటసాల): మోతాదుకు మించి మందులు వాడటం వలన మినుము పంటకు నష్టం వస్తుందని కేవీకే సమన్వయకర్త డాక్టర్ డి.సుధారాణి అన్నారు. ఘంటసాల కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలు మండలంలోని కొత్తపల్లి గ్రామంలో మంగళవారం పర్యటించారు. కేవీకే సమన్వయకర్త డాక్టర్ సుధారాణి మాట్లాడుతూ కృష్ణా జిల్లాలోని అన్ని ప్రాంతాల్లో మినుము పంటకు అధికంగా రసాయన మందులతో పాటు బలం మందులను కలిపి అధిక మోతాదులో పిచికారి చేయడంతో పైరు రొట్టగా పెరిగి పూత రావడం ఆలస్యం అవుతుందన్నారు. ప్రస్తుతం మినుము పంటను కాండం గజ్జి తెగులు ఆశించి నష్ట పరుస్తుందని, మొక్కలు వడలి చనిపోతున్నాయని చెప్పారు. దీని నివారణకు మెటలాక్సిల్, మాంకోజెబ్ మందు 300 గ్రాములు, లేదా టెబ్యుకొనజోల్ 300 మి.లీ. చొప్పున ఎకరాకు నేల తడిచేలా పిచికారీ చేసుకోవాలని సూచించారు. కేవీకే శాస్త్రవేత్తలు డాక్టర్ రేవతి, డాక్టర్ వెంకటలక్ష్మి, గ్రామ వ్యవసాయ సహాయకులు అలీ, రైతులు పాల్గొన్నారు.

సెంట్రల్ జోన్ ఆటల పోటీలు ప్రారంభం

అవనిగడ్డ: స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో గ్రిగ్ మెమోరియల్ సెంట్రల్ జోన్ బాలికల ఆటల పోటీలు మంగళవారం అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. ఎస్ఆర్ఐ బొబ్బా గోవర్ధన్ ఈ పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంత విద్యార్థినుల్లో నెలకొన్న క్రీడా నైపుణ్యాన్ని వెలికి తీసేందుకు ఇలాంటి పోటీలు దోహద పడతాయని చెప్పారు. వ్యాయామ ఉపాధ్యాయుల సంఘం జిల్లా అధ్యక్షుడు ఎం.మణి మాట్లాడుతూ విద్యార్థినులను ప్రోత్సహించేలా క్రీడా విజేతలకు బహుమతులు అందించేందుకు బొబ్బా గోవర్ధన్ ముందుకు వచ్చి ఆర్థిక సహాయం అందించడం అభినందనీయమన్నారు. తొలిరోజు కబడ్డీ, ఖోఖోలో విద్యార్థినులు పోటీ పడగా, ఎస్ఆర్ఐ గోవర్ధన్, కృష్ణబాబు విద్యార్థినులతో పాటు కబడ్డీ, ఖోఖో ఆడి వారిని ఉత్తేజపరిచారు. ఈ కార్యక్రమంలో రెడ్రౌతు కృష్ణబాబు, వ్యాయామ ఉపాధ్యాయుల సంఘం జిల్లా కార్యదర్శి సింహాద్రి గంగాధర్, వ్యాయామ ఉపాధ్యాయులు మారుతి, ఉదయ్, పూర్ణచంద్రరావు, సురేష్, మురళి, శ్రీకాంత్ ఈ పోటీలను పర్యవేక్షించారు.

పరోపకారమే పరిపూర్ణతకు మార్గం

మచిలీపట్నంఅర్బన్: స్థానిక కృష్ణవేణి ఐటీఐ ప్రాంగణంలోని సమావేశ మందిరంలో మంగళవారం ఆల్కాటు దివ్యజ్ఞాన సమాజం ఆధ్వర్యములో నిర్వహించిన సభలో థియోసఫికల్ సొసైటీ తెలుగు ఫెడరేషన్ లెక్చరర్, జాతీయ సభ్యులు సిస్టర్ మండలిక లక్ష్మి ప్రసంగించారు. పరోపకారమే పరిపూర్ణతకు మార్గమన్నారు. నిశ్చలమైన మనస్సుతో సత్యాన్ని చూడగలరని తెలిపారు. దైవం మనలోనే ఉందని ప్రేమతో అందరికీ సహాయం చేయాలని కోరారు. దివ్యజ్ఞాన సమాజం అధ్యక్షుడు లంకిశెట్టి బాలాజీ మాట్లాడుతూ రాబోయే రోజులలో విద్యార్థులలో నైతిక విలువలు పెంచడానికి పలు కార్యక్రమాలు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సొసైటీ కార్యదర్శి కొత్తగుండు రమేష్, గౌరవ అధ్యక్షులు సి.శేషాచార్యులు, కోశాధికారి ఎం.సత్యనారాయణ, సవరం వెంకటేశ్వరరావు, సమాజం సభ్యులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రైతులు విశిష్ట గుర్తింపు సంఖ్య పొందాలి

మోపిదేవి: వ్యవసాయ రంగాన్ని పూర్తిగా ఆధునికీకరణ చేసేందుకు కేంద్రం ప్రభుత్వం రైతులకు 11 అంకెలతో కూడిన ప్రత్యేక విశిష్ట గుర్తింపు సంఖ్య (ఐడీ) అందిస్తున్నట్లు ఎంఏవో కె.హెప్సిబా రాణి తెలిపారు. వెంకటాపురంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ఏవో మాట్లాడుతూ ఆధార్‌కార్డు తరహాలో ప్రతి రైతు కూడా రైతు సేవా కేంద్రాల్లో తమ భూములకు ఐడీ రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని సూచించారు. ఈ రిజిస్ట్రేషన్ నంబర్ ఉంటేనే రాబోయే రోజుల్లో ప్రధానమంత్రి కిసాన్, అన్నదాత సుఖీభవ, వ్యవసాయ యాంత్రీకరణ పథకాలు వంటివి పొందుతారని తెలిపారు. పట్టాదార్ పాసుపుస్తకం (1బి), ఆధార్ కార్డు, ఆధార్‌కు లింకు చేయబడిన ఫోన్ తీసుకుని రైతు సేవా కేంద్రంలో రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని వ్యవసాయ అధికారి తెలియ చేశారు.